కథ

# మా ఆయనకో భార్య

**వి.వాణీ మోహన్**

ఎప్పుడూ సంతోషంగా తిరుగుతూ సందడిగా ఉండే వరలక్ష్మి హెల్త్ చెకప్ చేయించుకు వచ్చిందగ్గర్నుంచి గుండుదెబ్బ తిన్న పక్షిలా పక్కమీద పడిపోయింది.

"ఈ డాక్టరు చెప్పిందే వేదమా? ఇంకో డాక్టరుకి చూపించి రెండో అభిప్రాయం తెలుసుకుందాం. మా చెల్లెలు లలితని రమ్మ న్నాను. కంగారు పడకు వరం. క్రొత్త మందులు ఎన్నో కనిపెట్టారు. ఆయుర్వే దంలో మంచి చికిత్స ఉంది మసాజ్‌లు చేయిస్తాను. నీకేం భయం లేదు" ఎంతో ప్రేమగా అనునయించాడు నరసింహం.

"జబ్బు చేస్తే చనిపోవడమేనా? మందులు వాడి కొద్ది రోజులు గమనించాలి అన్నారు అంతే కదా" అన్నాడు లాలనగా.

"రోగం ఫలాన అని నిర్ధారణ చెయ్యలేదు. ఈ తెలి యని జబ్బుకి మందేమిస్తారు? వెన్నెముక టిబియో, పెరాలసిస్సో, బ్లడ్ కాన్సరో అవుతుంది. దొంగ దెబ్బ తీస్తుంది. నాకు ఇది ఆఖరి దశే తెలుసు" అంటూ బావు రుమంది.

"వరం, నా వరం" అంటూ ముఖం అంతా ముద్దులు పెట్టుకుంటూ లోలోపల భయంగా ఉన్నా ఆమెకి ధైర్యం చెప్పాడు.

ముద్దు చేయించుకుంటున్న వరలక్ష్మి ఆ మత్తుతో మనసులో మాట చెప్పేసింది. "నేను లేకుండా ఎలా బ్రతుకుతారండి? నా లాంటి అమ్మాయిని వెతికి మీకు పెళ్లి చేస్తాను" అంది గుసగుసగా.

"పెళ్లా, నాకా" అని ఛప్పున ప్రక్క మీంచి లేవబో యాడు.

అతన్ని అల్లుకుని పడుకున్న వరలక్ష్మి ఆ ఊపుకి మంచం మీంచి అతనితో బాటు సగం లేచి "అమ్మో నొప్పి చచ్చాను బాబోయ్" అంటూ విలవిలలాడింది. నరసింహం గాభరా పడిపోయాడు.

"నీ అసాధ్యం కూల, సరిగ్గా పడుకో. వేన్నీళ్ల సంచీ వీపు క్రింద పెట్టనా? జ్వరం గానీ ఎక్కువైందా? నాకు పెళ్లేమిటే. ఇది సంధిప్రేలాపనా ఏమిటి కొంపదీసి" అంటూ నుదురు, పొట్ట తాకి చూశాడు. "పిల్లల్ని రమ్మని ఫోను చెయ్యనా? కళ్లు తెరు" అంటూ బ్రతిమిలాడాడు.

"ఎవ్వరూ ఒద్దు. మీరు నా పక్కనే ఉండండి. లలిత రాంగానే ఇంటర్వ్యూ ఏర్పాటు చేయిస్తాను. నేనెలాగూ కొద్ది రోజుల్లో చచ్చిపోతాను. చట్టాలు చట్టుబండలు నేనేం లెఖ్ఖ చెయ్యను" అంది వేదనగా.

"నీకేదో పూనింది. వెన్నెముక అరిగిపోయినంత మాత్రాన చచ్చిపోరు. ఆ పట్టీ వేశారు కద. గుండెనొప్పికి, మిగతా సమస్యలకి ఇదిగో రంగు రంగుల మాత్రలు న్నాయి. కొంచెం ఎక్కువే అనుకో. పళ్లరసాలు త్రాగు, శని, రాహువులకి జపాలు చేస్తున్నారు సిద్ధాంతి గారు. ఇదేదో మానసిక జబ్బో డిప్రెషన్ లాంటిది. పడుకో" అంటూ జోకొట్టాడు నరసింహం.

వారం రోజులు భారీగా గడిచాయి. తిండి మానేసి, మంచినీళ్ళు, బిస్కట్లు మీదే బ్రతికిన వరలక్ష్మి చిక్కిపో యింది. లలితని, ఆయన్ని నానా తిప్పలూ పెట్టింది.

"పోతున్నానర్రోయ్" అని అరుస్తూ మూలుగుతూ అందరికీ ఏమీ తోచకుండా చేసింది.

ఆఖరు అస్త్రంగా "మనం ఏదన్నా హిల్ స్టేషన్‌కి వెళ్దాం వరం.. పోనీ తిరుపతి వెళ్దాం. ఆ ఏడుకొండల గాలి, పరమాత్ముని సన్నిధి నీకు ఆరోగ్యం తెస్తాయి. నిన్ను వేన్‌లో పడుకోబెట్టి తీసుకెళ్తాం" అంటూ ప్రేమగా పక్కలో చోటుచేసుకున్నాడు.

వరలక్ష్మి నడుం చుట్టూ చెయ్యి వేసి నొక్కుతూ పదు కున్నాడు. ఆమె తనకి ఎంత అవసరమో ఆ సన్నిహి తంతో తెలియజేశాడు నరసింహం.

మంకుపట్టు వదలని వరలక్ష్మి లలిత సాయంతో పేపర్లో ప్రకటన ఇచ్చింది. "మా ఆయనకో భార్య కావ లెను. 40-50 సంవత్సరముల మధ్య వయసు కలిగి, అందమైన, చురుకైన, ఆరోగ్యవంతులైన స్త్రీలు అర్హులు. సంగీత, సాహిత్యాలతో పరిచయం, ప్రవేశం ఉండవ లెను. కొద్ది రోజుల్లో ప్రయాణమై పరలోకానికి వెళ్లిపోయే ఆయన భార్యనైన నా బాధ్యతలు నిర్వహించవలెను. వేరే కుటుంబ బాధ్యతలు లేనివారు కావలెను. ఈ క్రింది నెంబరుకి సంప్రదించవలెను"

ప్రకటన చూసి వచ్చిన ఫోన్లన్నీ వడపోసి లలిత సాయంతో నలుగుర్ని సెలెక్టు చేసింది.

ఒకే రోజు రెండేసి గంటల వ్యవధిలో వాళ్లని ఇంట ర్వ్యూకి పిలిచింది వరలక్ష్మి.

మొదటగా వచ్చిన ఊర్మిళ చువ్వలాగ పొడుగ్గా ఉంది. పొట్టిగా చెవుల మీదికి కత్తిరించుకున్న జుట్టు, కళ్ల జోడు, మెడలో చైనుకి వ్రేలాడుతూ పెద్ద పతకం. ఆ చైనుకి దిగువగా నల్ల రిబ్బనుకు వ్రేలాడుతూ మెరుస్తున్న సెల్‌ఫోనుతో సరాసరి లోపలికి వచ్చేసింది. ఉద్యోగంతో విసుగు వచ్చిందని, మానేసి ఏం చేయాలా అనుకుంటుం డగా ఈ ప్రకటన చూశానంది. మార్పుగా థ్రిల్లింగ్‌గా ఉంటుందని వచ్చాను అంది. "మరి మీరు ఎన్నాళ్లు బ్రతు కుతారో? పెళ్లి మీరు ఉండగానే అవుతుందా? చచ్చిపో యాకా? రిజిష్టర్డ్ లేక సన్నాయి మేళంతో శాస్త్రోక్తం గానా" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"అమ్మో ఆశ పాపం! నీ తొందరే గానీ పెళ్లి కొడుకు వివరాలు, అలవాట్లు తెలుసుకోవాలన్న ఆలోచన లేదు నీకు. నా లాంటి దానివి కాదు కనుక మా ఆయనకి సరి పడ జోడీవి కాదు వెళ్లిరా" అంది ఉద్రేకపడిపోతూ.


ఊర్మిళ ఫెళ్లున నవ్వింది. "నీలాంటిదాన్ని నేనెలా అవుతాను? నాకిది మొదటి పెళ్లే. ఇల్లు వాకిలి కారు అట్ట హాసంగా ఉన్నాయి. అతనెలాంటి వాడయినా ఫర్లేదు అయినా ముసలాయనకుండాలి ఛాయిస్, నీకేమి టమ్మా" అని నాలిక బైటపెట్టి వెక్కిరించి వెళ్లిపోయింది.

వరలక్ష్మి పళ్లు నూరుకుంది గట్టిగా. పళ్లు నొప్పి, నలుపు ఎక్కువైతే వేన్నీళ్లు బోల్డుసార్లు పుక్కిలి పట్టి నీర సంగా పడుకుంది. ఓ గంట దాటాక రెండో అమ్మాయి సురేఖ కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చింది. వరలక్ష్మికి ఒక పూలబొకే ఇచ్చి, "నైస్ మీటింగ్ యూ" అని ఎదురుకు ర్చీలో కూర్చుంది.

"మీరు మీ ఆయనకి పెళ్లి చేసి చనిపోవాలన్న సంక ల్పాన్ని నేను చాలా హర్షిస్తున్నాను. మీ ప్రేమ గొప్పది! నాకో డౌటు! పై లోకాల నుంచి మీ చోటులో ప్రవేశ పెట్టిన అమ్మాయిని మీరెలా సూపర్‌వైజ్ చేస్తారు? ఈ పనికి ఏదన్నా కోర్సు ఉందా? నేను చాలా కోర్సులు చేశాను. ఇవిగో సర్టిఫికెట్లు దొంతర. పై లోకాల నుంచి పర్యవేక్షించే కోర్సు నేను చెయ్యలేదు" వరలక్ష్మి దగ్గరగా కుర్చీ లాక్కుని రహస్యంగా అంది. "మీరు నేర్పుతారు కదాని వచ్చేశాను. మీ భర్త, ఆ సిల్లీ బోయ్, ఎలా ఉంటాడు? నాటీయా? ఉద్యోగం చేస్తాడా? పెంకి ఘటమా? నో ప్రాబ్లెమ్ ఐ కెన్ సెట్ హిమ్ రైట్, బాంకు పనులు, కోర్టు లావాదేవీలు టకటకా చేసేస్తాను. బైదిబై మీ ఇంట్లో కుక్ ఉందా? ఇదిగో నేను తినేవి ఈ లిస్ట్‌లో ఉన్నాయి" అంటూ ఓ పేపరు ఇచ్చింది వరలక్ష్మి చేతికి.

ఉదయం 6 నుంచి ధ్యానం, వ్యాయామం తర్వాత పళ్లరసాలు, ఫ్రెంచి టోస్టులు, ఫ్లేవర్డ్ యోగర్టులు, వివిధ రకాల సాలడ్స్‌తో లంచ్, సాయంత్రం టీతో తినే ఖరీదైన బిస్కట్లు, కేకులు, రాత్రి డిన్నర్‌కి ఓన్లీ 1 పుల్కా, 1 కప్పు ఫ్రైడ్‌రైస్ ఆఖరుగా ఏదన్నా పుడ్డింగ్. మధ్యమధ్య నమల దానికి చిప్స్ వెరైటీలు.

సురేఖ ఖరీదైన అలవాట్లు, అవసరాలు చదివిన వర లక్ష్మి కళ్లు తిరిగి దబ్బున వెనక్కి దిళ్ల మీద పడిపోయింది.




"ఓ పూర్ లేడీ, ప్రాణం పోయిందా? మైగాడ్. మీరు ఆవిడకేమవుతారు? నేను పెళ్లి కొడుకుని చూడక్కర్లేదు. ఈ ఫోటోలో ఈవిడ ప్రక్కనున్న హేండ్‌సమ్ హీరోయే కదా! సో- క్యూట్. ఐ లవ్ హిమ్. ఆవిడ సంగతి చూడండి. అంబులెన్స్ అదీ పిలవక్కర్లేదను కుంటాను. వీడ్కోలు ఏర్పాట్లు చేసెయ్యండి..సీ యూ ఆల్ సూన్" అంటూ ఒక్క గెంతులో గది బైటకి వెళ్లిపోయింది. కారు స్టార్ట్ అయిన చప్పుడు విన్న లలిత "హమ్మయ్య వెళ్లింది వదినా మెరుపుదాడి అది" అంది కొంటెగా.

వరలక్ష్మి నిస్తేజంగా చూస్తూ పడుకుంది.

మరోగంటకి గాలిలో తేలుతూ వచ్చిన హాయైన పరిమళం ముక్కుకి తాకగానే ఎర్రబ డిన కళ్లని తెరిచింది. మెత్తటి రెండు చేతులు వరలక్ష్మి చేతుల మీద ఆన్చి "నేనే సమీరని" అంది ఆ అమ్మాయి.

"నువ్వు, నేను ఎప్పుడయినా కలి శామా?" అంది.

తల అడ్డంగా త్రిప్పి సమ్మోహనకరంగా నవ్వింది సమీర. నలుపు, పీచు రంగులు కలి సిన రింగులు తిరిగిన పొడవాటి జుట్టు. అది వెర్రిగా ఎగరకుండా తలమీద నిలబెట్టిన నల్ల కళ్లజోడుతో తెల్లటి శరీర రంగుతో ఉన్న సమీర ఒంటికి దగ్గరగా, బిగుతుగా, పరువాల పొంగు కనపరుస్తూ బొడ్డు మీదికి చిన్నచొక్కా, ఒంటికి అతుక్కున్న జీన్స్‌పాంటు, పొడవాటి వ్రేలాడే చెవి రింగులతో అత్యాధునికంగా ఉంది.

రెప్పవేయక తననే చూస్తున్న వరలక్ష్మి వంక చూసి "రిలాక్స్‌గా ఉండండి. మీరు అడగదల్చుకున్నది అడ గండి మేమ్" అంటూ తన హేండ్‌బాగ్ లోంచి నెయిల్ పాలిష్ తీసింది. బాటిల్ రెండు అరచేతుల మధ్య జోరుగా కదుపుతూ వరలక్ష్మి చుట్టూ ఉన్న దిళ్లని, మందుల్ని చూసింది. సన్నగా వినిపిస్తున్న టేప్‌రికార్డర్ మ్యూజిక్ వింటూ, ఎ.సి. సౌఖ్యం అనుభవిస్తూ గోళ్లకి పాలిష్ వేసు కోసాగింది. వరలక్ష్మితో చూపు కలిసినపుడల్లా హాయిగా నవ్వులు విసురుతూ గడిపింది.

వరలక్ష్మి గబుక్కున తేరుకుని "నీకు ఇల్లు, పిల్లలు, భర్త అంటే సాధారణ కుటుంబ వ్యవహారాలు, బంధు త్వాలు అవి సమర్ధవంతంగా నిర్వహించగలను అన్న ధైర్యం ఉందా?" అంది.

"రెండో పెళ్లికి సిద్ధపడి వచ్చినదాన్ని. అవన్నీ తెలియ కుండా ఎలా ఉంటాను" అని ఎదురుప్రశ్న వేసింది గోళ్లు చూసుకుంటూ.

వరలక్ష్మికి 'అమ్మో గడుసుది' అనిపించి "నాకు ప్రశ్నకి జవాబు కావాలి, ఎదురుప్రశ్న కాదు మీరా" అంది సీరియస్‌గా.

"నా పేరు సమీర మేమ్. నా డ్యూటీలు ఏమిటో చెప్తారా? రాసిస్తారా? సంతకాలు చెయ్యాలా వివరించండి" అంది తాపీగా. అది సౌమ్యతా? తనయందు గౌరవమా? తెలియలేదు వరలక్ష్మికి.

"మా ఆయన ఏక పత్నీవ్రతుడు. నేను పోయాక దిగులుతో మతి పోగొట్టుకుంటారు. ఆయన్ని జాగ్రత్తగా కనిపెడుతూ మనిషిని చెయ్యాలి. ఆయన క్లబ్బు, బ్రిడ్జి ఆట, బిజినెస్‌లతో చాలా ఉల్లాసంగా ఉంటారు. ఆ హుషారు తగ్గకూడదు. ఆయన సంపూర్ణంగా మానసిక ఆనందం పొందేలాగ చూడాలి" అది.

"మానసిక ఆనందం- గుడ్" అంది సమీర ఓరగా చూస్తూ.

"నువ్వేమన్నా అనుకో, పై మెరుగులకి భ్రమపడి కొంగుల వెంటపడే మనిషికాదు అన్నాను కద. ఆహ్లాదకరమైన కంపెనీ ఇవ్వగలగాలి నువ్వు" అంది.

పకపక నవ్వింది సమీర. "ఇంత తేలిక అనుకోలేదు" అంది.

"ఉండు పూర్తిగా విను. మా అబ్బాయిలు ఇద్దరు. వాళ్ల భార్యలు, పిల్లలు కలిపి మొత్తం పదిమంది మా ఆయన స్వజనం. ఇదిగో ఈవిడ ఆయన చెల్లెలు లలిత, ఆవిడ కుటుంబం ఐదుగురు. టోటల్ ఈ పదిహేను మందికి ఏ లోటూ రాకుండా నేను వాళ్లని చూసినట్లే చూడాలి. మా తోటలో పువ్వుల్లాగ జాగ్రత్తగా, ప్రేమగా చూసుకోవాలి" అంది వరలక్ష్మి.

సమీర హాయిగా నవ్వింది.

"జోక్ అనుకోకు" అంది వరలక్ష్మి కఠినంగా.

"అబ్బే జోక్ ఏమిటండి. మీరింత దీక్షగా, ప్రేమగా మీ ఆయనకి కావల్సిన భార్య కోసం ఇంటర్వ్యూ చేస్తుంటే, మీ ప్రేమ అవధుల్లేనిది, ఘాటైనది" అంటూ నిట్టూర్చింది సమీర.

"నీకెన్నేళ్లు" అంది ఆరాగా వరలక్ష్మి.

"ఊహించండి మేమ్. ఇంత తెలివైన వారు. మీ ప్రకటనకి సరిపడ్డట్టుగా లేకపోతే రానే రాను" అంది గడుసుగా.

"మరి మా ఆయన ఫోటో చూడవా? ఆయన గురించి తెల్సుకోవా?" అంది ఆశగా.

"ఎందుకూ? మిమ్మల్ని చూశాక అయన్ని చూడ్డం అనవసరం. అయినా మీరు కోరుతున్నది ఆయనకి నేనిచ్చే మానసిక ఆనందం కద. నిశ్చింతగా ఉండండి మేమ్" చటుక్కున సమీర లేచి మంచం దగ్గరగా పచార్లు చేస్తూ అంది- "అన్నింటికీ కారణాలుండవ్. సహజ ప్రవృత్తి అది అని అర్థం" అంది సమీర.

"అయితే ఏమీ అడగక్కర్లేదంటావ్" అంది వరలక్ష్మి సందేహంగా. "ఉహూ!" అంటూ లేచింది.

"మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు నేను, నా సరంజామాతో వచ్చేస్తాను. మిమ్మల్ని కూడా బాగా చూసుకుని సాగనంపగలను" అంది వినయంగా.

వరలక్ష్మికి సమీర మీద చెప్పలేనంత ఇష్టం కలిగింది. ముచ్చట పడిపోయింది.

"సరే నీ సరంజామా అంటున్నావ్. ఆ ఎదురు గది సరిపోతుందా" అంది. "సరిపెట్టుకుంటాము మేమ్" అంది.

"బహువచనం వాడుతున్నావు. నీతో ఇంకా ఎవరన్నా ఉంటారా?" అంది భయంగా వరలక్ష్మి.

"అవును మేమ్. 4 సంవత్సరాల వయసున్న ఆప్సో జాతి కుక్క పిల్ల బుజిబుజి, 2 సంవత్సరాల వయసున్న తెల్లపిల్లి కాంతి, నల్ల పిల్లి నశి, మరి మాటలు నేర్చిన 3 సంవత్సరాల మైనా, అది నల్లగా మెరుస్తూ ఉంటుంది. తలకి అడ్డంగా పసుపు రంగు చార రిబ్బను కట్టినట్లుగా ఉంటుంది. తల విదిలిస్తూ 'సమీ' అంటూ పిలుస్తుంది. మీ పేరు పలకలేదేమో 'వరం' అనడం నేర్పుతాను. దాన్ని అస్సాంలో జటింగా అనే ఊరు నుంచి తెచ్చాను. ఈ జాతి మైనాలు అక్కడ అడవుల్లో దొరుకుతాయి" అని ఆగింది.



"ఇంకా ఏమన్నా ఉన్నాయా" అంది వరలక్ష్మి గాభరాగా.

"అవునండీ మా నాయనమ్మ నా పెళ్లి సారె అంటూ ఇచ్చిన రెండు పెద్ద బర్మా టేకు పెట్టెలు, ఆవిడవి 2 వీణలు అవి నిలబెట్టే 2 పెట్లెతో సహా. మా తాతగారు, నాయనమ్మ కలిసి పడుకుని పసందైన సంసారం చేసి పిల్లల్ని అంటే మా నాన్నని కన్న పందిరి మంచం. అది ఎక్కలేం మేమ్. క్రింద ముఖమల్ దిళ్లు బిగించిన అడుగు ఎత్తు పీట కూడా ఉంది. సులభంగా ఎక్కేయవచ్చు"

"ఉండుండు వీటన్నిటికీ ఆ గది కాదు కద మా ఇల్లు కూడా సరిపోదు" అంది కోపంగా.

"ఆడపిల్ల ఉత్తచేతుల్తో ఎలా వస్తుందండి అత్తింటికి. సారె తెస్తుంది కదా! గదిలో పట్టకపోతే తలుపు పెద్దది చేయిద్దాం. ఇంత లాన్, ఇంత పాలరాతి గచ్చు వరండా బ్యూటిఫుల్. నా బుల్లి స్నేహితులు హాయిగా గెంతులేస్తూ ఆడుకుంటాయి. బుజిబుజికి చల్లని గచ్చున్నా బుల్లి కుర్చీ కావాలి. ఊలు ఉండలా చుట్టుకుని పడుకుంటుంది. కాంతి, నిశి ఒక దాన్నొకటి తరుముతూ పరుగులు పెడతాయి. మైనా నన్ను పిలుస్తుంటుంది. సందడే సందడి. మీ గురించి శ్రద్ధ తీసుకుంటాను. ఆ వివరాలు రేపు. బై" అంటూ వరలక్ష్మి చెక్కిలి మీద ఓ ముద్దిచ్చి వెళ్లిపోయింది సమీర.

వరలక్ష్మి నెమ్మదిగా తేరుకుని "ఇంకెవర్ని చూసే ఓపిక లేదు లలితా. నేను ఎప్పుడు పోతానా ఇంట్లో తిష్ట వేద్దాం అనేగానీ, ఎవరి కోసం ఈ ఇంట్లోకి వస్తున్నారో వాళ్ల కబురు, కాకరకాయ అఖ్ఖర లేదు. వీళ్లకే పిదప కాలం, పిదపు బుద్ధులు! నా మొగుడు నాకే స్వంతం. ఎవ్వరికీ ఇవ్వలేను. ఆ గ్లాసు రసం తే, ఆ పళ్లు తే, పాలు యివ్వు. నేను తేరుకోవాలి" అంది ధైర్యంగా.

## పాపం మందిర!

'అప్పారావు ఫార్టీ ప్లస్' సినిమాతో టాలీవుడ్‌లోకి మందిరా బేడీ అడుగుపెడుతోందన్న సంగతి వినిపించి కొన్ని రోజులు కూడా కాలేదు, ఇందులో ఆమె నటించడం లేదని సిమ్రాన్ నటిస్తుందని వార్తలొచ్చాయిప్పుడు. ఇందుకు కారణం ఓ మిడిలేజ్డ్ నటుడికి (కృష్ణభగవాన్) జంటగా నటించడం వల్ల తన ఇమేజ్ దెబ్బతింటుందని మందిర భావించడమేనట. మందిర మాత్రం కుర్రపిల్లా ఏంటి? ఆమె కూడా నలభైల్లోకి వస్తున్న 'టింగణాయే'గా అని చెవులు కొరుక్కుంటున్నారు సినీ జనాలు. దాదాపు పదహారు పదిహేడేళ్ల క్రితం 'శాంతి' తొలి డైలీ టీవీ సీరియల్లో హీరోయిన్‌గా నటించిన మందిర ఇంకా టీన్స్‌లోనే వున్నాననుకుంటోంది కాబోలు! ప్చ్!